క్లుప్తంగా

కొనసాగుతున్న సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సాఫీగా కొనసాగుతుందని ఎంపీడీవో జవహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొత్తం 93 మంది ఎన్యుమరేటర్లను నియమించి 91 బ్లాకులుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఇళ్ల గుర్తింపు, యాజమానుల పేర్ల నమోదు ప్రక్రియ దాదాపు కొలికి వచ్చిందన్నారు. ఎవరైనా అందుబాటులో లేకపోయినా, హౌస్ లాక్ ఉన్న వారు రేపు కూడా నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఎంపీవో స్వప్నశీల, సిబ్బంది ఉన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 10న నిర్వహించనున్న టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేశ్ జోషి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు బత్తుల భూమయ్య, ప్రధాన కార్యదర్శి దారవత్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో సరఫరా చేసే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ చౌవాన్ జైవంత్‌రావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆంజీ గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలం బాట నిర్వహించారు. రైతులు మోటార్లకు కేపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేపాసిటర్ల ద్వారా విద్యుత్ సరఫరాను అదుపు చేయవచ్చన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ వినియోగం, విద్యుత్ ప్రమాదలు జరిగితే నివారణ చర్యలు, విద్యుత్ పొదుపు, మోటార్ల నిర్వాహణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ సుభాష్, ఏఈ రోహిదాస్, సిబ్బంది మానిక్‌రావ్, నరేశ్, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

సర్వేలో కార్యదర్శులదే కీలక పాత్ర

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోన్‌పల్లి సంజీవ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాల పరిస్థితులపై సమగ్ర సమాచారం అందిస్తూ సర్వేలో కీలక పాత్రలు పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం గుర్తించి అన్ని రకాలుగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోర్లకుంట దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

ఆర్సీవోకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమశాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్‌గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించి అగస్టీన్‌ను బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఇక్కడి ప్రజలకు, విద్యార్థులకు గురుకుల విద్యాలయాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

సేవల్లో కీలకం.. ప్రజలకు దూరం



టీచర్స్ కాలనీలోని భూగర్భ జల వనరులశాఖ కార్యాలయం



కైలాస్‌నగర్‌లోని మైనింగ్, దేవాదాయ శాఖ కార్యాలయం



పోలీసు కాలనీలోని డ్రగ్స్ కార్యాలయం



కైలాస్‌నగర్‌లోని ఫుడ్‌సేఫ్టీ కార్యాలయం

ప్రజల ఆహార, ఆరోగ్య భద్రతలు పర్యవేక్షించడంలో కీలకమైన శాఖలు ప్రజలకు తెలిసేలా అందుబాటులో ఉండాలి. కానీ జిల్లా కేంద్రంలో కార్యాలయాలు ఉన్నాయన్న సంగతి కూడా ఎవరికీ తెలియదు. ఇటీవల నాసిరకం ఆహార పదార్థాలు, వస్తువులు బయటపడుతున్నాయి. ఇలాంటి వాటిపై ఫిర్యాదు చేయాలంటే ఆయా కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయనేది ప్రజలకు తెలియకపోవడం గమనార్హం. వీటితో పాటు మైనింగ్, దేవాదాయ శాఖ, భూగర్భజల వనరుల శాఖ పట్టణానికి చెరోవైపు అన్నట్టుగా ఉన్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కేక్ కట్ చేస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని కేక్‌కట్ చేశారు.ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

కొలువుదీరిన జైనథ్ మార్కెట్ పాలకవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

- మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లూరి అశోక్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం అట్టహాసంగా సాగింది. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా సావపూరే విలాస్‌తో పాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. మార్కెట్ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటానన్నారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు. పాలకవర్గాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ గజానంద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి మధుకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డైరెక్టర్లు బాస సంతోష్, రాంరెడ్డి, ఆశక్క, మహెమూద్, ప్రభాకర్, స్వామి, చంద్రకాంత్, సీతారాం, విక్రాంత్, రాజన్న, రామన్న, రాములు, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిహారం అందజేత



పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: మండలంలోని బాబెర గ్రామానికి చెందిన జాదవ్ దిలీప్‌కు చెందిన ఎద్దు గత నెల 23న పెద్దపులి దాడిలో మృతి చెందింది. కాగా నష్ట పరిహారం కింద ఆయనకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 25000ల విలువ గల చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం బాధిత రైతుకు అందజేశారు. వన్యప్రాణుల వల్ల నష్టం జరిగితే అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నష్టపరిహారం పొందాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నాగోరావ్, గోవింద్, ధన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈవో

బోథ్: బోథ్ ఎంఈవోగా కుమ్మరి పోశెట్టి శుక్రవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం పీఆర్టీయూ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమూద్ హుస్సేన్, హన్మాండ్లు, ప్రసాద్, సంగుస్వామి, ముంతాజ్ ఖాన్, రజిత, శ్రీనివాస్, రవిరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విలీనం చేస్తేనే సర్వే చేయాలి'

ఇంద్రవెల్లి: మల్లాపూర్ గ్రామాన్ని ఇంద్రవెల్లి మండలంలో విలీనం చేస్తేనే సర్వే చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో భాగంగా శుక్రవారం సిరికొండ మండలంలో విలీనమైన మల్లాపూర్ గ్రామానికి వెళ్లిన అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. సిరికొండ నుంచి తిరిగి ఇంద్రవెల్లి మండలంలో తమ గ్రామానికి విలీనం చేస్తేనే సర్వేకు సహకరిస్తామన్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సీసీఐ సబ్‌స్టేషన్‌లో 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బద్కా మొహల్లా, జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బ్రాహ్మణవాడ ప్రాంతాల్లో సరఫరా నిలిచి ఉంటుందన్నారు. అదేవిధంగా భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిచి ఉంటుందని, భుక్తాపూర్, భాగ్యనగర్, వడ్డెర కాలనీ, క్రాంతినగర్, హమాలీవాడ, తాటిగూడ, చిల్కూరి లక్ష్మినగర్, మహాలక్ష్మివాడ, జైజవాన్‌నగర్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తాంసి: మండలంలోని పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మనోజ్ కుమార్ తెలిపారు. 33 కేవీ అర్లి(టి) విద్యుత్‌లైన్ ఫీడర్ పరిధిలోని మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మైసమ్మ గుడిని కట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు నందు, ఉపాధ్యక్షుడు ఆకాష్, కోశాధికారి ఇర్ఫాన్, తిరుమల్, ఆనంద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు తీసుకోండి

నార్నూర్: గాదిగూడ మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయని ఉపాధ్యాయులను నియమించాలని ఆదివాసి గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా, వైద్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని ఆరోపించారు. పున్నగూడ, మరేగామ్, కొలమా, కునికాసా, చిన్నకుండి, అలిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు లేక మూత పడినట్లు తెలిపారు. ఒక్కొక్క పాఠశాలలో 25 నుంచి 30 మంది గిరిజన విద్యార్థులు చదువుకోవడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట ఆదివాసీ నాయకుడు కనక ప్రభాకర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజలు



పూజలు చేస్తున్న మార్వాడీలు

ఆదిలాబాద్: మార్వాడీలు భక్తిశ్రద్ధలతో ఛట్ పూజలు నిర్వహించారు. శుక్రవారం పెన్‌గంగా తీరంలో వేకువ జామున సూర్యభగవానుడికి అర్చన చేశారు. ఈ సందర్భంగా షష్ఠి దేవతా, సూర్యనారాయణుడికి నైవేద్యాలను సమర్పించారు. అయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సౌజన్య

తాంసి: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి సౌజన్య అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పోక్సో చట్టం, బాల్యవివాహలు, టోల్ ఫ్రీ నంబర్ ద్వా రా అందించే వివిధ రకాల సేవలను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం, ఉమేష్ రావు డోలె, నగేశ్, పీపీ రమణ రెడ్డి, హెచ్ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: వృత్తి విద్యా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. షిరిడిసాయి సేవ సమితి, స్వామి రామానుజ తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యానగర్‌లో వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గత మూడు నెలలుగా టైలరింగ్, కంప్యూటర్ డిజైన్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌లలో శిక్షణ పొందారు. షిరిడిసాయి సేవ సమితి, స్వామి రామానుజ తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో 17 రంగాల్లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి గుర్తింపు పొందాలన్నారు. నిర్వాహకులు కంది శ్రీనివాస రెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ డైరెక్టర్ పీఎస్ఆర్ లక్ష్మి, ఇన్‌చార్జి కృష్ణ విహారి, దెబ్బడి అశోక్, కోటేశ్వరరావు, దేవిదాస్ దేశ్‌పాండే, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

ఇచ్చోడ: ప్రభుత్వం అందించే బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్‌కుమార్ దామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలపై గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత మధ్యతరగతి కుటుంబాల కోసం ప్రభుత్వం తక్కువ ప్రీమియంతో ఎక్కువగా బీమా వర్తించే విధంగా స్కీంలను ప్రకటించిందన్నారు. ప్రతిఒక్కరూ ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొదుపు ఖాతాలు, డిపాజిట్లు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ విజయ్, ఆర్థిక అక్షరాస్యత సంస్థ కౌన్సిలర్లు సంతోష్, ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా హాకీకి పూర్వ వైభవం



ట్రోఫీతో విజయసంకేతం చూపుతున్న అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాలో హాకీ క్రీడకు పూర్వ వైభవం వస్తుందని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్– 17 హాకీ టోర్నమెంట్లో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఎంతో కాలం తర్వాత ఆదిలాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. నలుగురికి జాతీయస్థాయిలో అవకాశం రావడం గొప్ప విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లో రాణించి సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, శిక్షకులు శ్రీనివాస్, శేఖర్, రవి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు

వర్ధంతి సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: తాంసి మండలం ఈదుల్ల సావర్గాంలో ఈనెల 10న నిర్వహిస్తున్న ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రథమ శాసన సభ్యులు, కామ్రేడ్ దాజీశంకర్ 38వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, కుంటాల రాములు పాల్గొన్నారు.

11న ఉచిత వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌బీఎస్‌కే, డైస్ ఆధ్వర్యంలో ఈనెల 11న గ్రహణమొర్రి, అంగిలి చీలిక ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ వైసి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు రిమ్స్‌లోని అవుట్‌పేషెంట్ బిల్డింగ్ రెండో అంతస్తులో శిబిరం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఏవీఆర్ ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్ బృందం ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నల్లా కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మున్సిపల్ ద్వారా ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్ ప్రారంభించారు. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి దీన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ అతీఖ్‌బేగం, షరీఫ, వనిత, వినోద, సుదర్శన్, కవిత, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై దుమ్ము.. దుమ్ము



ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు అలసత్వంతో ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. వచ్చిపోయే వాహనాలతో దుమ్ము లేవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండల కేంద్రంలో గత కొన్ని రోజుల నుంచి రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. పనులు కొనసాగుతున్న రోజుల్లో దుమ్ము లేవకుండా నీరు చల్లాలి. కానీ కాంట్రాక్టర్ నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.